క్లుప్తంగా

వంద శాతం పంపిణీకి చర్యలు


మాట్లాడుతున్న ఏఎస్‌ఓ అంకయ్య

నెల్లూరు(పొగతోట): స్మార్ట్ రేషన్‌కార్డులను వంద శాతం అందజేసేలా చర్యలు తీసుకోవాలని ఏఎస్‌ఓ అంకయ్య మండలాధికారులను ఆదేశించారు. ఆయన జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కార్యాలయం నుంచి గురువారం మండలాధికారులతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 7.10 లక్షల స్మార్ట్ కార్డులు మంజూరు చేశామన్నారు. ఇప్పటి వరకు ఆరు లక్షలకుపైగా కార్డులను లబ్ధిదారులకు అందజేశామన్నారు. మిగిలిన కార్డులు త్వరగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నెల్లూరు నగరం, రూరల్‌కు సంబంధించి 35 వేల కార్డులకు అధికంగా పంపిణీ చేయాల్సి ఉందన్నారు. రేషన్ పంపిణీ ప్రక్రియలో లోటుపాట్లు లేకుండా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

డీఆర్డీఓ మాజీ చైర్మన్‌తో కలెక్టర్ భేటీ



నెల్లూరురూరల్: కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆహ్వానం మేరకు ఆయన క్యాంపు కార్యాలయంలో డీఆర్డీఓ మాజీ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి గురువారం అల్పాహార విందుకు హాజరయ్యారు. అనంతరం వారు మర్యాదపూర్వకంగా భేటీ అయి జిల్లాకు సంబంధించిన పెండింగ్ ప్రాజెక్టులపై చర్చించారు.

ఘనంగా పోలూరి జయంతి


ఉపదేశామృత తరంగిణి గ్రంథావిష్కరణ

నెల్లూరు(బృందావనం): పురమందిరం ప్రాంగణంలోని వర్తమాన సమాజ భవనంలో పోలూరి హనుమజ్జానకీ రామశర్మ 101వ జయంతి సభ బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. సర్వోదయ కళాశాల విశ్రాంత ఉపన్యాసకుడు డాక్టర్ చీమకుర్తి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో చీరాలకు చెందిన డాక్టర్ అన్నదానం చిదంబరశాస్త్రి హాజరై, త్రిపుర రహస్య జ్ఞాన ఖండసారంపై ఉపన్యసించారు. అనంతరం 'ఉపదేశామృత తరంగిణి' గ్రంధాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో హనుమజ్జానకీరామశర్మ కుటుంబసభ్యులు చతుర్వేదుల నరసింహమూర్తి, జ్యోత్స్న, మీనాక్షి, రామశేషు పాల్గొన్నారు.

కొత్త జీఎస్టీతో తగ్గిన ఔషధ ధరలు

- ఎన్టీఆర్ వైద్యసేవా కోఆర్డినేటర్ సుధీర్‌కుమార్


పెద్దాస్పత్రిలో మాట్లాడుతున్న డాక్టర్ సుధీర్‌కుమార్

నెల్లూరు(అర్బన్): కొత్త జీఎస్టీతో మందుల ధరలు తగ్గాయని ఎన్టీఆర్ వైద్యసేవా జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సుధీర్‌కుమార్ తెలిపారు. నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రి, అలాగే మెడికవర్ ఆస్పత్రుల్లోని పేషెంట్లకు, సహాయకులకు జీఎస్టీపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. పేదలను దృష్టిలో ఉంచుకుని ఎన్‌డీఏ ప్రభుత్వం జీఎస్టీని భారీగా తగ్గించిందని వివరించారు. పెద్దాస్పత్రిలో జరిగిన సదస్సులో సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

చెకుముకి సంబరాల పోస్టర్ ఆవిష్కరణ



నెల్లూరు (టౌన్): స్థానిక జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతి ఏడాది 8, 9, 10 తరగతులకు నిర్వహిస్తున్న చెకుముకి సంబరాల వాల్ పోస్టర్‌ను డీఈఓ బాలాజీరావు చేతుల మీదుగా గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓలు తిరుపాల్, మురళి, జన విజ్ఞాన వేదిక నాయకులు పాల్గొన్నారు.

స్మార్ట్ స్ట్రీట్ బజార్ పరిశీలన

నెల్లూరు సిటీ: మైపాడుగేట్ సెంటర్‌లోని స్మార్ట్ స్ట్రీట్ బజార్‌ను రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే రోల్ మోడల్‌గా స్మార్ట్ స్ట్రీట్ బజార్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తొలివిడతలో 30 కంటైనర్లలో 120 షాపులు సిద్ధం చేశామని చెప్పారు. మొత్తం ఐదు మున్సిపాలిటీల్లో ప్రయోగాత్మకంగా స్మార్ట్ స్ట్రీట్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. అందులో తొలుత నెల్లూరు సిటీలో ఇది ప్రారంభమవుతోందన్నారు.

వక్ఫ్ భూమిని అన్యాక్రాంతం చేస్తే ఊరుకోం

- రూ.కోట్ల విలువ చేసే స్థలాన్ని ధారాదత్తం చేసేందుకు కుట్ర చేస్తున్న కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు సిద్ధిఖ్


జామియా మసీదు భూమి వద్ద మాట్లాడుతున్న సిద్ధిఖ్

నెల్లూరు(బృందావనం): నగరంలోని జామియా మసీదుకు చెందిన కోట్లాది రూపాయల విలువ చేసే వక్ఫ్ భూమిని అన్యాక్రాంతం చేస్తే ఊరుకునేది లేదని, ప్రాణత్యాగం చేసైనా సరే ఆ భూమిని కాపాడుకొంటామని వైఎస్సార్‌సీపీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు సిద్ధిఖ్ ప్రభుత్వానికి, వక్ఫ్‌బోర్డుకు అల్టిమేటం జారీ చేశారు. జామియా మసీదు భూమిని అన్యాక్రాంతం కాకుండా అడ్డుకొనేందుకు ఎంతటి పోరాటానికైనా వెనుకాడమని ఆయన ప్రకటించారు. ఈ మేరకు పరమేశ్వరి నగర్‌లో ముస్లిం మైనార్టీ నేతలతో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పరమేశ్వరి నగర్‌లో వక్ఫ్‌బోర్డు అధికారులు, జామియా మసీదు కమిటీ సభ్యులు సర్వేనంబర్ 117, 118, 119, 120లో ఉన్న 13.33 ఎకరాల భూమిని సర్వే చేసి, హద్దులు ఏర్పాటు చేసి అన్యాక్రాంతం కాకుండా కాపాడుతామంటూ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్‌అజీజ్ చెప్పారన్నారు. రాష్ట్రంలో ఉన్న ముస్లిం మైనార్టీల బిడ్డల ఉన్నత విద్య, ఉజ్వల భవిష్యత్తు కోసం రూ.15 కోట్లు అవసరమని, ఆ నిధుల కోసం వక్ఫ్‌బోర్డు భూమిపై రెవెన్యూ జనరేట్ చేసి ప్రణాళిక పూర్తి చేస్తానంటూ అబ్దుల్‌అజీజ్ చెప్పడంతో పాటు అనుసరిస్తున్న తీరు ముస్లింలలో ఆగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయంటూ ధ్వజమెత్తారు. అజీజ్ చెప్పే మాటలు, ప్రణాళికలు నమ్మశక్యంగా లేవన్నారు. కేవలం రూ.15 కోట్ల కోసం రూ.కోట్ల విలువ కలిగిన భూమిని అన్యాక్రాంతం చేయాలన్న ఆలోచన విరమించుకోవాలని హితవు పలికారు. మైనార్టీల సంక్షేమంటూ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అనుసరిస్తున్న తీరుతెన్నులు విడ్డూరంగా ఉన్నాయన్నారు. మైనార్టీల పట్ల అబ్దుల్‌అజీజ్‌కు అంత ప్రేమే ఉంటే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వద్ద సంక్షేమానికి అవసరమైన రూ.15 కోట్లు తీసుకుంటే ఎంతో బాగుంటుందని సూచించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నేత ఖలీల్‌అహ్మద్, నగర మైనార్టీ సెల్ అధ్యక్షుడు అబ్దుల్‌మస్తాన్, కార్పొరేటర్ కరీముల్లా, మైనార్టీ నాయకులు జియా ఉల్ హక్, సమీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మసీదు స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే సహించం

జామియా మసీదు స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే సహించేది లేదని వైఎస్సార్‌సీపీ మేధావుల ఫోరమ్ రాష్ట్ర అధికార ప్రతినిధి సమీర్‌ఖాన్ తెలిపారు. నగరంలో జామియా మసీదు స్థలంలో గురువారం ఆయన మాట్లాడారు. వక్ఫ్‌బోర్డుకు సంబంధించి ఇంటర్మీడియట్ చదివిన వ్యక్తి సీఈఓగా ఉండడం సిగ్గు చేటన్నారు. వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన రూ.వేల కోట్లు ఆస్తులను రక్షించేందుకు 50 మంది సిబ్బంది మాత్రమే ఉన్నారన్నారు. జామియా మసీదుకు చెందిన 13.5 ఎకరాల స్థలంలో ముస్లింలకు మసీదు, ఖబరస్థాన్, మైనార్టీల చదువు కోసం అబ్దుల్‌కలామ్ పేరుతో ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జామియా మసీదు స్థలం వివాదాన్ని ముస్లిం పర్సనల్ లా బోర్డు దృష్టికి తీసుకెళ్లనున్నామన్నారు.

ప్రమాదభరితంగా విద్యుత్ స్తంభాలు



వైకుంఠపురంలో నివాసాలపై ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఐదో డివిజన్ వైకుంఠపురంలో గిరిజనులు నివసిస్తున్న ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ప్రమాదభరితంగా మారాయి. నివాసాలపై ఒరిగిపోయి పడిపోయే స్థితిలో ఉన్నాయి. దీనిపై పలుమార్లు విద్యుత్ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని స్థానిక గిరిజనులు ఆరోపిస్తున్నారు. ఈ విద్యుత్ స్తంభాలు ఏ సమయంలో తమ ఇళ్లపై పడుతాయోనని ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. కాగా స్థానిక సీపీఎం నాయకులు ఈస్ట్–1 విద్యుత్ సెక్షన్ కార్యాలయంలో గురువారం అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ ప్రాంతంలో ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చాలని, అదేవిధంగా ఇక్కడ నివసిస్తున్న గిరిజన కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందించాలని, లేనిపక్షంలో గిరిజనులతో కలిసి విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చిరంజీవి, నరసింహా, రాంబాబు, నాగయ్య తదితరులు, పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ క్రీడాకారులకు అభినందన



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఇటీవల అనకాపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి 12వ సబ్ జూనియర్ చాంపియన్ షిప్ పోటీల్లో మూడో స్థానం సాధించిన నెల్లూరు సాఫ్ట్‌బాల్ క్రీడాకారులను గురువారం నగరంలో అభినందించారు. స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు మలిరెడ్డి కోటారెడ్డి, కామేశ్వరిలు క్రీడాకారులకు సర్టిఫికెట్లు, మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో కోచ్‌లు సుకృత, మహేష్, హరి, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

కేన్సర్ బాధితులకు పౌష్టికాహారం



నెల్లూరు(బృందావనం): కొండాయపాళెం రోడ్డు వనంతోపు సెంటర్ దగ్గర ఉన్న అబైడింగ్ హోప్ ట్రస్ట్ కార్యాలయంలో పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా సౌజన్యంతో వంద మంది కేన్సర్ బాధితులకు పౌష్టికాహార ఫుడ్ ప్యాకెట్లను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ డైరెక్టర్ డాక్టర్ టైటస్ నిర్మల్‌కుమార్ మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా ఏహెచ్‌టీ, పీఆర్‌ఎస్ఐల సహకారంతో రూ.1,500 విలువ కలిగిన పౌష్టికాహారం ప్యాకెట్లు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్వోదయ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రజని, ఆంగ్ల అధ్యాపకురాలు స్వర్ణలత, ఎ.జయప్రకాష్, సిస్టర్లు రమ, జయ, నిర్మల పాల్గొన్నారు.

12న మ్యూజికల్ నైట్


ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో ఈనెల 12వ తేదీ సుమధుర గాయకుడు కిశోర్‌కుమార్ మ్యూజికల్ నైట్ 2025ను ఘనంగా నిర్వహిస్తున్నట్లు మహమ్మద్ రఫీ కల్చరల్ అకాడమీ అధ్యక్షుడు జావిద్ అహ్మద్ తెలిపారు. పురమందిరం ప్రాంగణంలో కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను గాయకులు పి.అమానుల్లాఖాన్, సయ్యద్ మహబూబ్‌బాషాతో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జావిద్ అహ్మద్ మాట్లాడుతూ కిశోర్ కుమార్ 38వ వర్ధంతిని పురస్కరించుకుని నగరంలో తొలిసారిగా మ్యూజికల్ నైట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పది మంది గాయకులతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన సీనియర్ గాయకులు పాల్గొంటారన్నారు.

పరిసరాల శుభ్రత తప్పనిసరి


చెత్త సేకరణను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

ఇందుకూరుపేట: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత తప్పనిసరి అని జెడ్పీ సీఈఓ మోహన్‌రావు అన్నారు. మండలంలోని డేవిస్‌పేటలో చెత్త సేకరణపై ఇంటింటి సర్వే గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రతను ప్రతిఒక్కరూ విధిగా పాటించాలన్నారు. పారిశుద్ధ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. తడి, పొడి చెత్తను ప్రజలు వేర్వేరుగా ఇవ్వాలని, అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేంద్రబాబు పాల్గొన్నారు.

15న రూరల్ సర్వసభ్య సమావేశం

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈనెల 15వ తేదీన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వీరమణమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు పాల్గొనాలని సూచించారు.

మెంటల్ హెల్త్ అవేర్‌నెస్‌పై నేడు సెమినార్

నెల్లూరు (టౌన్): ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఇండియా–నెల్లూరు ఆధ్వర్యంలో స్థానిక టౌన్‌హాల్‌లో మెంటల్ హెల్త్ అవేర్‌నెస్ సెమినార్‌ను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెమినార్‌లో కాన్‌ఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్, డిజిటల్ అడిక్షన్ రెమిడీస్, ఎమోషనల్ ఇంటెలిజెన్స్, స్ట్రెస్ మేనేజ్‌మెంట్, సూసైడ్స్ రెమిడీస్, ఇంపార్టెన్స్ ఆఫ్ మెంటల్ హెల్త్ తదితర వాటిపై ప్రముఖ వక్తలు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అదేరోజు ఉదయం 6.30 గంటలకు గాంధీ విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు మానసిక ఆరోగ్య అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు.

కలెక్టర్‌ను కలిసిన కోవూరు ఎమ్మెల్యే

నెల్లూరురూరల్: కలెక్టర్ హిమాన్షు శుక్లాను ఆయన క్యాంపు కార్యాలయంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కోవూరు నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు.

నేరాల కట్టడికి చర్యలు తీసుకోవాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలో వరుస హత్యలు భయాందోళనలు కలిగిస్తున్నాయని, నేరాల కట్టడికి తగిన చర్యలు చేపట్టాలని జిల్లా బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి బుధవరపు బాలాజీ గురువారం ఒక ప్రకటనలో కోరారు. నగరంలో గంజాయి, మాదకద్రవ్యాలు తీసుకున్న యువకులు వీరంగం చేస్తున్నారన్నారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ చేసే పోలీసులకు వీరు కనిపిస్తున్నా అదుపులోకి తీసుకోవడానికి వెనుకాడుతున్నారన్నారు. రౌడీ గ్యాంగులను పోలీసులు అదుపులోకి తీసుకుంటే అధికార పార్టీ నాయకులు ఆయా పోలీస్ స్టేషన్లకు ఫోన్లు చేయడం, వారిని విడిపించాలని ఒత్తిడి తేవడంతో నేరాలు పెరిగిపోతున్నాయన్నారు. రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా నగరంలో శాంతిభద్రతలు కాపాడేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నేటి నుంచి గ్రేట్ సింహపురి షాపింగ్ ఫెస్టివల్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు మర్చంట్ అండ్ ట్రేడ్ అసోసియేషన్స్ వారు గ్రేట్ సింహపురి షాపింగ్ ఫెస్టివల్‌ను నేటి నుంచి 19వ తేదీ వరకు నగరంలోని ఇందిరాభవన్‌లో నిర్వహిస్తున్నట్లు నెల్లూరు డివిజన్ జాయింట్ కమిషనర్ కిరణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమంలో భాగంగా ఈ ఎగ్జిబిషన్ కమ్ సేల్స్‌లో తగ్గించిన ఎలక్ట్రానిక్ వస్తువులు, ద్విచక్ర వాహనాలు, బీమా ఉత్పత్తులు, పాల ఉత్పత్తులు తదితర వస్తువులను విక్రయించనున్నట్లు తెలిపారు. జీఎస్టీ రేట్ల తగ్గింపును వినియోగదారులకు తెలిపేందుకు నిర్వహిస్తున్నామని వివరించారు.

వాటర్ ప్లాంట్ పునరుద్ధరణకు ధర్నా

- ఇంటింటికీ కరపత్రాల పంపిణీ


కరపత్రాలను అందజేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

నెల్లూరు(అర్బన్): కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో రూ.4 కోట్ల నిధులతో 2009లో బుజబుజనెల్లూరులో ఏర్పాటు చేసిన దేశంలోనే రెండో అతిపెద్ద వాటర్ ప్లాంట్ ప్రస్తుతం వినియోగంలో లేదని, దీనిని పునరుద్ధరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కె.పెంచలనరసయ్య, రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆ పార్టీ కార్యకర్తలు గురువారం ధర్నా చేశారు. ప్లాంట్‌ను పునరుద్ధరించాలని, కార్పొరేషన్ తీరును నిరసిస్తూ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుజబుజనెల్లూరు ఉత్తమ పంచాయతీగా ఉన్న కాలంలో ఇక్కడ ఫ్లోరైడ్ నీరు ఉండేదన్నారు. అలాంటి తరుణంలో హరిత విప్లవ పితామహుడు, వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్, భారత ప్రభుత్వ సెక్రటరీ రామస్వామి చేతుల మీదుగా 20 వేల మంది దాహార్తిని తీర్చడానికి ఇక్కడ మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభించారన్నారు. అయితే కాలక్రమంలో పంచాయతీని నగరపాలక సంస్థలో విలీనం చేశాక ఈ ప్లాంటును మూసేశారన్నారు. ఇక్కడి స్థలాలను కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఖరీదైన జనరేటర్లను కూడా అధికారులు ప్రజలకు చెప్పకుండా దొంగతనంగా ఎక్కడికో తరలించారన్నారు. ఇక్కడ కార్మికులు, బేల్దారి కూలీలే ఎక్కువ మంది ఉన్నారన్నారు. వారు నెలకు రూ.1000కి పైగా ఖర్చు చేసి వాటర్ క్యాన్లను కొనుగోలు చేస్తున్నారన్నారు. ఈ ప్లాంట్‌ను పునరుద్ధరించాలని కమిషనర్, కలెక్టర్‌కు పలు దఫాలుగా అర్జీలు ఇచ్చినా ఫలితం లేదన్నారు. తప్పని పరిస్థితుల్లో ఆందోళన చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే నిరాహార దీక్షలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఖలీల్, నాగేశ్వరరెడ్డి, మాల కొండయ్య, నరసింహారెడ్డి, కృష్ణమూర్తి, తిరుపాలు, వెంకయ్య, ఓబులరెడ్డి, శ్రీనివాసులు, నారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పెద్దాస్పత్రిలో స్వచ్ఛోత్సవ్


పెద్దాస్పత్రి ఆవరణలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు

నెల్లూరు(అర్బన్): సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్స్ ఆధ్వర్యంలో కృష్ణచైతన్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(పెద్దాస్పత్రి)లో స్వచ్ఛోత్సవ్ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు ఆస్పత్రి ఆవరణలో పరిసరాలను పరిశుభ్రం చేశారు. స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించారు. అనంతరం రోగులకు, వారి సహాయకులకు ఆస్పత్రిలో సదస్సు ఏర్పాటు చేయగా, సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి పాల్గొని, మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రతతో అనేక రకాల వ్యాధులను దూరం చేయవచ్చన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్స్ క్షేత్ర ప్రచార సహాయకుడు హరికృష్ణ మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవలో భాగంగా స్వచ్ఛోత్సవ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేశారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు సర్టిఫికెట్‌లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మేరా యువ భారత్ అధికారి మహేంద్రరెడ్డి, కృష్ణ చైతన్య డిగ్రీ కళాశాల డీన్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

నాలుగు మున్సిపల్ దుకాణాల సీజ్


మున్సిపల్ దుకాణాలను సీజ్ చేస్తున్న రెవెన్యూ అధికారులు

నెల్లూరు(బారకాసు): అద్దె బకాయిలు చెల్లించని కారణంగా నగరపాలక సంస్థకు చెందిన పలు మున్సిపల్ దుకాణాలను ఎన్ఎంసీ రెవెన్యూ అధికారులు గురువారం సీజ్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కార్పొరేషన్ కమిషనర్ వైఓ నందన్ ఆదేశాల మేరకు ఎన్ఎంసీకి చెందిన స్థానిక చిన్నబజార్, ఏసీఎస్సార్ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని షాప్ నంబర్ 2కు రూ.లక్ష, షాప్ నంబర్ 11కు రూ.6.57 లక్షలు, షాప్ నంబర్ 22కు రూ.72 వేలు, షాప్ నంబర్ 30కు రూ.15 లక్షలు చెల్లించకుండా కాలయాపన చేస్తూ ఉన్నందున.. వారికి ఇది వరకే చాలాసార్లు నోటీసులు జారీ చేశారు. అయినా స్పందించకపోవడంతో అధికారులు గురువారం చర్యలకు ఉపక్రమించారు. నగరపాలక సంస్థ రెవెన్యూ ఆఫీసర్ సమద్ ఆధ్వర్యంలో తమ సిబ్బంది రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు సీవీఎస్ కిరణ్, వరప్రసాద్‌లు సచివాలయ సిబ్బందితో కలిసి ఆయా షాపులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సమద్ మాట్లాడుతూ భవన యజమానులు, అద్దెదారులు సకాలంలో అన్నిరకాల పన్నులను చెల్లించి, నెల్లూరు నగరపాలక సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. అనంతరం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిరణ్ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందితో కలిసి బ్రహ్మానందపురం, అంబేడ్కర్ నగర్ ప్రాంతంలో మూడు కుళాయిల కనెక్షన్లను తొలగించారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్లు కిశోర్, శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

సీజేపై దాడికి యత్నం హేయం


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేస్తున్న సీపీఐ నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడికి యత్నం హేయమైన చర్య అని, ఇది న్యాయ వ్యవస్థపై జరిగిన దాడి అని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నందిపోగు రమణయ్య అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో వీఆర్సీ సెంటర్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల నుంచి ఆర్ఎస్ఎస్ మూకలు మారణ హోమాలు సృష్టిస్తున్నాయని ఆరోపించారు. రాజకీయ లబ్ధి కోసం మతాలు, సున్నితమైన అంశాలను రెచ్చగొట్టేలా ప్రవర్తిస్తూ, ప్రజల్లో విభజనలు తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. దేశంలోని ప్రజాస్వామ్య, లౌకిక వాదులు చీఫ్ జస్టిస్‌పై జరిగిన దాడికి యత్నాన్ని ఖండించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ, వ్యవసాయ కార్మిక సంఘం, మహిళా సంఘం నాయకులు రామరాజు, జిలానీఖాన్, లీలామోహన్, వనజ, సోఫియా, నాగేంద్ర, శ్రీనివాసులు, రమేష్, సుహానా, జ్యోతి, రేవంత్, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆవులు, కోతుల తరలింపు


రోడ్లపై సంచరిస్తున్న ఆవులను పట్టుకుని గోశాలకు తరలిస్తున్న ఎన్ఎంసీ సిబ్బంది

నెల్లూరు(బారకాసు): నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై సంచరిస్తున్న ఆవులు, కోతులను కార్పొరేషన్ సిబ్బంది గురువారం పట్టుకుని తరలించే ప్రక్రియ చేపట్టారు. నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ ఆదేశాల మేరకు కార్పొరేషన్ పశు వైద్యాధికారి డాక్టర్ మదన్‌మోహన్ ఆధ్వర్యంలో స్థానిక మద్రాస్ బస్టాండ్, ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్, ఫత్తేఖాన్‌పేట, పాత మున్సిపల్ కార్యాలయ ప్రాంతాల్లో రోడ్లపై సంచరిస్తున్న ఆరు పశువులను స్పెషల్ డ్రైవ్ ద్వారా గురువారం తెల్లవారుజామున పట్టుకొని కల్లూరుపల్లి గోశాలకు తరలించారు. అదేవిధంగా స్థానిక యలమలవారిపాళెం ప్రాంతంలో స్థానికులను ఇబ్బంది పెడుతున్న 30 కోతులను పట్టుకొని జిల్లా సరిహద్దు సమీపంలోని బద్వేలు అటవీ ప్రాంతంలో విడిచిపెట్టినట్లు పశు వైద్యాధికారి డాక్టర్ మదన్‌మోహన్ తెలియజేశారు.

కందమూరులో ఉచిత పశువైద్య శిబిరం



నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ మండలంలోని కందమూరు గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం కింద ఉచిత పశువైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు.

ఈ సందర్భంగా పశువులకు పలు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కందమూరు సర్పంచ్ అరుణమ్మ, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.